క్లుప్తంగా

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న అనిల్‌కుమార్



పమిడిముక్కల: ఐనంపూడి గ్రామంలోని వేణు గోపాలస్వామిని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు యేనుగ వెంకటేశ్వరరావు, ప్రసాద్, బొల్లా సాంబశివరావులు అనిల్‌కుమార్‌ను సత్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

వర్షం నీరు తొలగింపునకు చర్యలు



తోట్లవల్లూరు: తోట్లవల్లూరు కనకదుర్గమ్మ కాలనీలో రోడ్లపై నిలిచిన ముంపునీరు తొలగింపునకు గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాలనీలోని అంతర్గత రోడ్లు వర్షం నీటిలో చిక్కుకున్నాయి. దీంతో కాలనీవాసులు కొన్ని రోజులుగా వర్షం నీటిలో రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. దీంతో మురుగునీటి తొలగింపునకు సర్పంచ్ పెనుమత్స రాధిక చర్యలు చేపట్టారు. కూలీలను ఏర్పాటు చేసి వర్షం నీరు నిలువ ఉన్న రోడ్లకు ఇరువైపులా డ్రెయిన్ల పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. డ్రెయిన్ల పూడికతీతతో రోడ్లపై నిలిచిన నీరు బయటకు తరలివెళుతోంది. పనులను పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

పామర్రులో వర్షం



పామర్రు: పామర్రులో శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పలు రహదారులు జలమయంగా మారాయి. గ్రామంలోని బాపూజీ పేట, అరండాల్‌పేట, గాంధీనగరంలో పలు రోడ్లు వర్షం నీటితో నిండిపోయాయి. పామర్రు చల్లపల్లి ప్రధాన రహదారికి డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా వర్షం నీరు రహదారిపై నిలిచి పోయింది. దీంతో స్థానికులు రాక పోకలకు అవస్థలు ఎదుర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: వరహాపట్నం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. వరహాపట్నం సబ్ స్టేషన్ పరిధి గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా అంకమ్మతల్లి సంబరాలు



తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెంలో ఆళ్ల వారి అంకమ్మతల్లి సంబరాలు ఘనంగా ముగిశాయి. సంబరాల తొలిరోజైన శనివారం గ్రామంలో డప్పు వాయిద్యాల నడుమ పోతురాజు గెడ ఊరేగింపు, రెండో రోజైన ఆదివారం అమ్మవారికి మొక్కుల చెల్లింపు కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల్లో నివశిస్తున్న ఆళ్ల వంశీకులు పెద్ద ఎత్తున హాజరై అంకమ్మతల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించటంతోపాటు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ ఆళ్ల సాంబిరెడ్డి, కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

పేకాట శిబిరంపై దాడి



చినముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం చిన ముత్తేవి పొలాల్లో సాగుతున్న పేకాట శిబిరంపై కూచిపూడి ఎస్ఐ కేఏస్ విశ్వనాథ్ తన శిబ్బందితో ఆదివారం దాడి చేశారు. పామర్రు సీఐ వి.సుభాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ దాడిలో ఎనిమిది మంది జూదరులు డబ్బులు పెట్టి పేకాట ఆడుతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.35,200ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

పల్లెల్లో పడకేసిన పశువైద్యం



వీరంకిలాకు పశువైద్యశాల

పమిడిముక్కల: మండలంలోని పలు గ్రామాల్లో సిబ్బంది కొరతతో పశువైద్యం సక్రమంగా అందడం లేదు. పెరిగిన పశువుల ధరలు, దాణా ఖర్చులు, సక్రమంగా అందని పశువైద్యంతో పశుపోషకులు వాటిని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. పలు గ్రామాల్లో వ్యవసాయం తరువాత పశుపోషణకే ప్రాధాన్యం ఇస్తారు.

మండలంలో తొమ్మిది వేల పశువులు

మండలంలోని 25 గ్రామాల్లో తొమ్మిది వేల పశువులు, 10వేల జీవాలున్నాయి. మండల కేంద్రమైన వీరంకిలాకు, కపిలేశ్వరపురం, కృష్ణాపురంలలో మూడు పశువైద్యశాలలు ఉన్నాయి. కపిలేశ్వరపురంలో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. గురజాడ, మంటాడ, అగినపర్రు, పెనుమత్స, ఐనపూరు, మేడూరు, లంకపల్లిలో ఏడు గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. ఏడు చోట్ల డాక్టర్లు ఉన్నప్పటికీ వారికి సహాయకులు (వెటర్నరీ అసిస్టెంట్)లు లేరు. నిత్యం పదుల సంఖ్యలో వచ్చే పశులన్నింటినీ పరీక్షించి వైద్యం చేయడం వైద్యులకు భారం అవుతోంది. పెనుమత్స గ్రామీణ పశువైద్యశాలలోని జేవీఓ సెలవుపై వెళ్లడంతో కొంత కాలంగా ఇక్కడ పశువైద్యం సక్రమంగా అందడం లేదు. లంకపల్లి డాక్టర్‌కు పెనుమత్స బాధ్యతలు అప్పగించినప్పటికీ పూర్తి స్థాయిలో వైద్య సేవలందడం లేదని రైతులు చెబుతున్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల భవనం

పెనుమత్స గ్రామీణ పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. పూర్తిగా తొలగించి కొత్తది నిర్మించాల్సి ఉంది. కృష్ణాపురం పశువైద్యశాల భవనం చాలక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. భవనానికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. మందులు నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక అవస్థలు పడుతున్నారు. వీరంకిలాకు పశువైద్యశాలకు ప్రహరీ లేకపోవడంతో సెలవు దినాలు, రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారింది.

కృష్ణాపురంలో పశువైద్యశాల భవనం నిర్మించాలి

కృష్ణాపురం పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే నీరుకారుతోంది. భవనంలో మందులు, రిజిస్టర్‌లు నిల్వ చేసుకునే అవకాశమే లేదు. పాత భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలి.

– యార్లగడ్డ శివ, ఉపసర్పంచ్

సహాయకులను నియమించాలి



గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ భారంగా మారింది. దీనికి తోడు పశువైద్యం కూడా సక్రమంగా అందకపోతే పశువులను అమ్ముకోవాల్సిందే. పశువైద్యులకు సహాయకులను నియమించి, పశువైద్యం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి.

– కనుమూరి వెంకటేశ్వరరావు, లంకపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత, భవనాల దుస్థితి తదితర సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో జరగనున్న బదిలీల్లో సిబ్బంది వచ్చే అవకాశం ఉంది. సిబ్బంది కొరత ఉన్నా పశుపోషకులకు మెరుగైన సేవలందిస్తున్నాం. 170 పశువులకు ఇన్సూరెన్స్ చేయించాం. రాయితీపై పశువుల దాణాను అందజేస్తున్నాం.

– కె.రాంనరేష్, మండల పశువైద్యాధికారి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విద్య నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థినులు



తోట్లవల్లూరులో పూర్వ విద్యార్థులు



కౌతవరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తోట్లవల్లూరు: పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా జరిగింది. తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాలలో 1996–97వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఇరవై ఎనిమిదేళ్ల తరువాత కలిసిన తమ సహచర మిత్రులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

గురువులకు సత్కారం..

ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు డీవీ సుబ్బారావు, నరేంద్ర, సంధ్యారాణి, విఠల్‌పాల్, సురేష్, బీ. శ్రీనివాసరావు, ఎం. చంద్రశేఖర్, ఈడ్పుగంటి శామ్యూల్‌ను సన్మానించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అందరూ సహపంక్తి భోజనాలు చేసి ఆనందోత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థులు పెనుమత్స రాధిక, గోరిపర్తి సూర్యనారాయణ, జంపాన బాలరాజు, కిలారపు వీరబాబు, వీరంకి రాంబాబు, వీరంకి రాము, జ్యోతి, శారద తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కాగా 28 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న స్నేహితులంతా కలుసుకోవటం చాలా ఆనందంగా ఉందని తోట్లవల్లూరు సర్పంచ్ పెనుమత్స రాధిక పేర్కొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కౌతవరం కానూరి దామోదరయ్య జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 1998–2003 టెన్త్ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయులు నాగిరెడ్డి, పద్మావతి విచ్చేశారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం విద్యాభ్యాసం చేసే రోజుల్లో వారి వారి అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ ఆనంద తీరంలో మునిగితేలారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీకుమారి, శ్రీనివాసరరావు, వెంకట ప్రసాద్, సత్యనారాయణ, కె.శ్రీనివాసరరావు, సీహెచ్.ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహనీయుల బాటలో నడుద్దాం



బోయినవారిపాలెంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన రాధాకృష్ణ



గుడ్లవల్లేరులో శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి రంగా, ఎస్వీఆర్ విగ్రహాల ఆవిష్కరణ

గుడ్లవల్లేరు: పేద వర్గాల అభివృద్ధికి మహనీయుల చూపిన బాటలో నడుద్దామని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. గుడ్లవల్లేరు వైఎస్సార్ బ్రిడ్జిపై శ్రీకృష్ణ దేవరాయలు, వంగవీటి మోహనరంగా, ఎస్వీ రంగారావు విగ్రహాల సముదాయాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యాసంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు చేతుల మీదుగా కాపు సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రారంభించారు. అలాగే కైకాల సత్యనారాయణ భార్య కైకాల నాగేశ్వరమ్మ చేతుల మీదుగా కౌతవరంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన కైకాల విగ్రహాన్ని వంగవీటి ప్రారంభించారు. కైకాల సోదరుడు లక్ష్మీనారాయణ, కుమారులు కైకాల రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. కైకాల విగ్రహంతో పాటు వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. చిత్రం గ్రామంలో మీఎం రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పాలేటి చంటి, మిరియాల రాజేంద్రప్రసాద్, బాడిగ నాని, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, వల్లభనేని కృష్ణప్రసాద్, కొడాలి రామరాజు, సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి

పసుమర్రు(బోయిన వారి పాలెం): మాజీ శాసన సభ్యుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత నేత వంగవీటి మోహన రంగా ఆశయ సాధనకు అందరం కలిసి కృషి చేయాలని విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని పసుమర్రు గ్రామ శివారు బోయినవారిపాలెంలో ఆదివారం దివంగత నేత వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ నేటి తరం నేతలు రంగా ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము , రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, రాధారంగా మిత్ర మండలి ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులు, విగ్రహ దాత బుల్లెట్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక మావురమ్మ అమ్మవారి జాతర

కొత్తపేట(అవనిగడ్డ): మండల పరిధిలోని కొత్తపేటలో వేంచేసియున్న రేణుక మావురమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భూపతి వారి ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మావురమ్మకు గ్రామంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు, విక్కుర్తి రాంబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, భూపతి నాంచారయ్య పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీల అధ్యక్షుడిగా హరికృష్ణ



గుడివాడరూరల్: గుడివాడ డివిజనల్ పంచాయతీ సెక్రటరీల నూతన కార్యవర్గాన్ని ఆదివారం పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, కార్యాలయ సబ్ ఆర్డినేటర్లు, ఇతర సిబ్బంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా వి.హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా బీవీ రమణ, కె.వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా టి.లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శులుగా సీవీఎల్ఎస్ఆర్‌వి ప్రసాద్, డి.సుస్మితను ఎన్నుకున్నారు. కోశాధికారిగా కె.సురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సరస్వతి, వి.లక్ష్మణరావు, ఎస్.నరేష్, కె.నాగరాజు, వి.రత్నాకరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ విష్ణుప్రసాద్ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన హరికృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష పదవిని ఏకగ్రీవంగా అప్పగించిన తన తోటి ఉద్యోగులు, సిబ్బందికి ధన్యవాదాలన్నారు.

సంతాన నాగేంద్రస్వామికి లక్ష మల్లెల పూజ



కైకలూరు: స్థానిక ఏలూరు రోడ్డు కాల్వగట్టుపై వేంచేసిన శ్రీ సంతాన నాగేంద్ర స్వామికి ఆదివారం లక్ష మల్లెల పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చావలి శంకర శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు సీహెచ్ హేమలత ఆధ్వర్యంలో పలువురు గోష్టి మహిళలు ఓం నమశ్శివాయ, సుబ్రహ్మణ్యాష్టక పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖులు పంద్రంగి ప్రసాద్, చినిమిల్లి సత్యనారాయణ, పురోహితులు రుద్రపాక ప్రసాద్, కంఠం రాజు పృధ్వీకుమార్ శర్మ, పూర్ణేష్ శర్మ, కార్తవీర్యా శర్మ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైరు సాగుతో భూసారం పెంపు



పచ్చిరొట్ట సాగుగా పిల్లి పెసర

పామర్రు: రబీ సాగు అనంతరం పొలాల్లో పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారాన్ని పెంచుకుని తద్వారా రసాయని ఎరువులను తగ్గించుకోవచ్చని పామర్రు ఏడీఏ స్వర్ణలత తెలిపారు. విచక్షణా రహితంగా రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోతుందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పైర్ల వల్ల ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తి అవుతుందని తెలిపారు. కట్టి జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి, ఆడవినీలిని పచ్చిరొట్ట పైర్లు అంటారు. పూత దశ వరకూ పెంచి భూమిలో కలియదున్నాలి. పచ్చి రొట్ట పైర్లలో స్థూల పోషకాలైన నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకూ ఉంటుంది. అదేవిధంగా భాస్వరం 0.1 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. పొటాషియం 0.5 శాతం నుంచి 2.0 శాతం వరకు ఉంటాయి. వీటితో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి.

ఆటోనగర్ కార్మికులకు ఉపాధి కల్పించాలి



విలేకరులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

గుడివాడ టౌన్: ఆటోనగర్‌లో కార్మికులకు పనులు లేక ఆర్థికంగా సతమతమవుతున్నారని, వారికి ఉపాధి కల్పించాలని కృష్ణా జిల్లా ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బొంతు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఆటోనగర్ అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చారన్నారు. ఉపాధి కల్పనకు కృషి చేస్తామని, అభివృద్ధిలో భాగంగా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల సంక్షేమానికి ఏ ఒక్క కార్యక్రమం చేపట్టకపోవడంతో పనులు లేక కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారన్నారు. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు రైతులకు అందజేస్తామని తెలిపారు. అయితే ఆ కార్యక్రమం నెరవేర్చకపోవడంతో పనులు లేక చేతి వృత్తుల వారు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆటో నగర్ అభివృద్ధితో పాటు కార్మికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, ఎ. లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడికి సత్కారం



డాక్టర్ మాగంటి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు

గుడివాడ టౌన్: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) డాక్టర్ మాగంటి శ్రీనివాస్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక పెద్దవీధిలోని స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న కొలుసు నాగరాజుకు రూ. 5 వేలు, పేద విద్యార్థి ఎ. రాకేష్‌కు రూ. 5 వేలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవాసంస్థ సేవా కార్యక్రమాల్లో తాను భాగస్వామినై ప్రజలకు సేవలందిస్తామన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినపుడు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, గుడివాడ శాఖ చైర్మన్ పి. వేణుగోపాలరావు, అధ్యక్షుడు ఎ. గోపిరెడ్డి, కార్యదర్శి ఎస్. పద్మజ, ఉపాధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, కార్యదర్శి సీహెచ్ మోహన్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



సర్వాలంకార భూషితులైన స్వామివారు



అమ్మవార్లు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో మానసికోల్లాసం



ఆడుకుంటున్న విద్యార్థులు



జమీగొల్వేపల్లిలో విద్యార్థులకు కుర్చీల ఆట



మండవల్లిలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై శిక్షణ

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు నిర్వహించే ఆటపాటలతో మానసికోల్లాసంతో పాటు విజ్ఞానం ఏర్పడుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి పేర్కొన్నారు. ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు చెస్, క్యారమ్స్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై శిక్షణ

మండవల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాయలయంలో విద్యార్థులకు ఆదివారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

జమీగొల్లేపల్లిలో..

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడం వలన శారీరక వ్యాయామంతో పాటు మానసిన వికాసం కూడా కల్గుతుందని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం చిన్నారులతో కుర్చీల ఆట ఆడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



కామినేనికి అమ్మవారి చిత్ర పటం అందజేత

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు అత్యధిక సంఖ్యలో పోటెత్తారు. ఆదివారం భక్తులు తమ మొక్కులను భక్తిప్రపత్తులతో చెల్లించుకునేందుకు బారులు తీరారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కొండలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కామినేని

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనను వేద పండితులు దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందజేశారు.